జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రజలకు రక్ష

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


విజయనగరం : జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ముందులు పంపిణీ చేస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: అన్ని వర్గాల ప్రజలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఈ అవకాశాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఇటువంటి కార్యక్రమం దేశంలోనే మొదటిసారిగా మన రాష్ట్రంలో అమలు చేస్తున్నట్లు చెప్పారు. నగరంలోని పూల్‌బాగ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల బుధవారం ప్రారంభించారు. 1,2,3,4,5 సచివాలయాల పరిధిలో గల ప్రజలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి వైద్య పరీక్షలను సద్వినియోగం చేసుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందులో భాగంగా వైద్యరంగంలో ఇప్పటికే అనేక రకాల సంస్కరణలు తీసుకువచ్చిందన్నారు. నగరంలో ఏడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా ప్రజల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రికి ఉన్న చిత్తశుద్ధి ఎంతో తెలుస్తుందని చెప్పారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఇప్పటికే ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలను నమోదు చేసుకోవడం జరిగిందని తెలిపారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, భద్రతకు వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తూ, శస్త్రచికిత్సలు చేయడానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. రెండో డివిజన్ కార్పొరేటర్ బండారు ఆనందరావు మాట్లాడుతూ, 15వ తేదీ వరకు వైద్యశిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి ఆరోగ్య వివరాలు ప్రభుత్వం వద్ద నమోదు కావడం వల్ల భవిష్యత్‌లో ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. ప్రజల మౌలిక సదుపాయాలు కల్పనకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని ప్రజలందరూ మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ లయా యాదవ్, కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు మారోజు శ్రీనివాసరావు, వజ్రపు సత్యగౌరి, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

457 మందికి వైద్య సేవలు..


దెంకాడ: సింగవరంలో రోగులకు మందులు అందిస్తున్న ఎంపీపీ వాసుదేవరావు తదితరులు

దెంకాడ: మండలంలోని సింగవరంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో 457 మందికి వైద్య సేవలు అందించారు. శిబిరాన్ని ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు ప్రారంభించారు. 202 మందికి సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించగా, 152 మందికి స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు అందించారు. 103 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. పది మందిని వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన వైద్యానికి రిఫర్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.ఆదిలక్ష్మి, ప్రత్యేకాధికారి జమదగ్ని, సర్పంచ్ పిట్టా పద్మావతి, వైఎస్సార్‌సీపీ నాయకులు పిట్టా అప్పారావు, బావన గురువులు, బమ్మిడి రమణ, సంచాన కృష్ణమూర్తి, లెంక అప్పలనాయుడు, సచివాలయ, వైద్యాధికారులు, సిబ్బంది, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఖరీదైన వైద్యం..


పూసపాటిరేగ: కొప్పెర్లలో జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

పూసపాటిరేగ: జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులకు ఖరీదైన వైద్యం అందుతోందని జేసీఎస్ కన్వీనర్ మహంతి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని కొప్పెర్ల సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 520 మందిని వైద్యసిబ్బంది పరీక్షించి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశంలో ఏ ఇతర రాష్ట్రాలలో లేనివిధంగా ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్న వ్యక్తి జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఇ.భాస్కరరావు, ఎంపీడీఓ ఎం. రాధిక, ప్రజాప్రతినిధులు మహంతి జనార్దనరావు, పుప్పాల లక్ష్మీనారాయణ, లంకలపల్లి రాజారావు, దాడిశెట్టి త్రినాథరావు, బొల్లు రమేష్, అద్దగర్ల సత్యారావు, ఆకిరి ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ...


నెల్లిమర్ల : హెల్త్ క్యాంప్‌లో పాల్గొన్న చైర్‌పర్సన్ సరోజిని, వైద్య సిబ్బంది

నెల్లిమర్ల: ప్రజారోగ్యంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తున్నారని నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని అన్నారు. నగర పంచాయతి పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (సీకేఎం)లో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపులో ఆమె మాట్లాడుతూ, దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయని విధంగా వైద్యరంగాన్ని బలోపేతం చేసిన ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ వెంకట కృష్ణారావు, నగర పంచాయతీ కమిషనర్ పి. బాలాజీ ప్రసాద్, వార్డు కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, సచివాలయ కన్వీనర్లు, వివిధ బోర్డుల డైరెక్టర్లు, ఇతర ప్రజాప్రతినిధులు, మెడికల్ సిబ్బంది, అంగన్‌వాడీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

గుంటూరు వెళ్లి పింఛన్ అందజేత..


ఆదిలక్ష్మికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ అప్పలనాయుడు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని అలుగోలు గ్రామానికి చెందిన వలంటీర్ సారిక అప్పలనాయుడు ఏకంగా గుంటూరు వెళ్లి లబ్ధిదారురాలికి పింఛన్ అందజేశారు. వివరాల్లోకి వెళితే... గ్రామానికి చెందిన ఉశెట్టి ఆదిలక్ష్మి ఆరోగ్య పరిస్థితి బాగోలేకపోవడంతో ఇటీవల గుంటూరులో ఉంటున్న తన కుమారుడి వద్దకు వెళ్లి ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో వలంటీర్ అప్పలనాయుడు గుంటూరు వెళ్లి బుధవారం పింఛన్ అందజేశాడు. దీంతో వలంటీర్‌ను పలువురు అభినందించారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

విజయనగరం: నగరంలోని పూల్‌బాగ్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల్లో భాగంగా ఈనెల 6వ తేదీన పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్‌శాఖాధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి 10 వరకు సబ్‌స్టేషన్ పరిధిలో గల ప్రాంతాలకు సరఫరా ఉండదని పేర్కొన్నారు. ఇందులో భాగంగా పూల్‌బాగ్‌కాలనీ, జగదాంబనగర్, మారుతీనగర్, లక్ష్మీగణపతి కాలనీ, మంగళవీధి కాలనీ, ప్రేమ సమాజం ఏరియా, కొత్తపేట నీళ్ల ట్యాంక్ ఏరియా, కొణిసి వీధి, అంబటిసత్రం జంక్షన్, పార్క్ గేట్ ఏరియా, కోలగట్ల వారి వీధి, కుమ్మరవీధి, లంకాపట్నం, సిద్ధి వినాయక్‌నగర్, అయ్యప్పనగర్, వేణుగోపాలపురం, తదితర ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పల్సర్ ఎన్ 150 మోడల్ ప్రారంభం


కొత్త బైక్‌ను ప్రారంభిస్తున్న రీజనల్ మేనేజర్ కరుణాకరణ్, తదితరులు

పూసపాటిరేగ: పేరాపురం జంక్షన్‌లో గల బజాజ్‌షోరూంలో పల్సర్ ఎన్ 150 కొత్త మోడల్‌ను బజాజ్ రీజనల్ మేనేజర్ ఎస్.కరుణాకరన్ బుధవారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మోటార్ సైకిల్ రంగంలో అత్యధికంగా పల్సర్ బైక్‌ల విక్రయాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో బజాజ్ ప్రతినిధులు శ్రీనివాసులరెడ్డి, కె. గోపాలకృష్ణ, ఎ. శ్రీనివాస్, బూర్లె కార్తీక్, బి.జయరాం, తదితరులు పాల్గొన్నారు.

ఎంబ్రాయిడరీ యూనిట్ ప్రారంభం

దెంకాడ: మండలంలోని పెదతాడివాడ పంచాయతీ పరిధి ఏఎస్ఆర్ నగర్‌లో వైఎస్సార్ క్రాంతిపథం, డీఆర్‌డీఏ ద్వారా ఏర్పాటు చేసిన ఎంబ్రాయిడరీ వర్క్‌మిషన్ యూనిట్‌ను ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు బుధవారం ప్రారంభించారు. ఏపీజీవీబీ ద్వారా రూ.4 లక్షల 30 వేల యూనిట్ గ్రామానికి చెందిన దవల శ్రావణికి మంజూరైంది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పిన్నింటి తమ్మునాయుడు, ఎంపీటీసీ సభ్యులు పొంతపల్లి జగన్నాథం, గాదిపల్లి రమేష్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కరుమజ్జి త్రినాథ్, జేసీఎస్ కన్వీనర్ సారిక గౌరి, ఏరియా కో ఆర్డినేటర్ రాజ్‌కుమార్, ఏపీఎం విజయలక్ష్మి, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

సక్రమంగా అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ


అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ రామారావు

నెల్లిమర్ల రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీడీఓ రామారావు సూచించారు. మండలంలోని చంద్రంపేట అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు క్రమంతప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ, గురువారం నిర్వహించనున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆరా తీశారు. పంచాయతీలో అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులు ఆరోగ్య సురక్షను వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు కర్రోతు వెంకటరమణ, వాల్లే అప్పలనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత లోపిస్తే సహించేది లేదు..

● కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు


అభివృద్ధి పనులపై ఇంజినీరింగ్ అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఎప్పటికప్పుడు ఇంజినీరింగ్ సిబ్బంది పరిశీలించాలని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు ఆదేశించారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం వివిధ ప్రాంతాలలో పర్యటించి అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించారు. కొన్నిచోట్ల సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు లోపించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటీ అగ్రహారం, బీసీ కాలనీలో నిర్మితమవుతున్న వాటర్ ట్యాంక్ నిర్మాణాలను పరిశీలించారు. అలాగే మజ్జిపేట, బీసీ కాలనీలలో నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లు, కాలువలను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. బీసీ కాలనీ సీసీ రోడ్డులో నాణ్యత లోపించడంతో వెంటనే ఇంజినీరింగ్ అధికారులను పిలిచి హెచ్చరించారు. ఆయా ప్రాంతాలలో నెలకొన్న ఆక్రమణలను 24 గంటల్లోపు తొలగించాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ అమ్మాజీరావుకు సూచించారు. కార్యక్రమంలో కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల విస్తరణ పనుల పరిశీలన


రోడ్ల విస్తరణ పనులపై అధికారులతో చర్చిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: నగర అందాలను మరింత ఇనుమడింపజేసే విధంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు మయూరి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. పోలీస్, ఆర్‌అండ్‌బీ, కార్పొరేషన్ శాఖల అధికారులతో ఆ ప్రాంతమంతా కలియతిరిగారు.

ఆ మార్గంలో పెద్ద చెరువు గట్టుకు ఆనుకుని ఏర్పాటు చేస్తున్న వాటర్ ఫౌంటెన్ల ప్రగతిని పరిశీలించారు. రహదారి విస్తరణ, ట్రాఫిక్ ఐలాండ్ అభివృద్ధి చర్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు మాట్లాడుతూ, మయూరి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు జరుగుతున్న రహదారి అభివృద్ధి పనులు పైడితల్లి జాతర సమయానికల్లా పూర్తి చేసేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నామన్నారు. అన్ని శాఖల సమన్వయంతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. ఆర్‌అండ్‌బీ డీఈ శ్రీనివాసరావు మాట్లాడుతూ, రూ.3.40 కోట్లతో మయూరి జంక్షన్ నుంచి అంబేడ్కర్ జంక్షన్ వరకు రహదారి విస్తరణ పనులు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ డీఎస్పీ డి.విశ్వనాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు రవిచంద్ర, యడ్ల రాజేష్, కార్పొరేషన్ ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

ఉద్యోగం ఇవ్వాలి..


చైర్‌పర్సన్ బంగారు సరోజినికి వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

నెల్లిమర్ల: నగర పంచాయతీ పారిశుద్ధ్య విభాగంలో కాంట్రాక్ట్ కార్మికురాలుగా పనిచేస్తూ 2021 అక్టోబర్ 6న అనారోగ్యంతో మరణించిన తుపాకుల రమణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని సీఐటీయూ నాయకుడు ఎ. జగన్ మోహనరావు కోరారు. ఈ మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ – ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, వైస్ చైర్మన్లు సముద్రపు రామారావు, కారుకొండ కృష్ణలను బుధవారం కలిసి వినతపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా జగన్ మోహనరావు మాట్లాడుతూ, రమణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని రెండు సంవత్సరాలుగా కోరుతున్నా.. జీఓ లేదని అధికారులు దాటవేస్తున్నారన్నారు. పర్మనెంట్ కార్మికులకు ఉన్న జీఓ ఆధారంగా మానవతా దృక్పథంతో విజయనగరం, విశాఖపట్నం, శ్రీకాకుళం, బొబ్బిలి, తదితర చోట్ల స్థానిక శాసనసభ్యులు, కౌన్సిల్ ఆమోదంతో కాంట్రాక్ట్ కార్మికులకు కూడా కారుణ్య నియామకాలు చేపడుతున్నారని తెలిపారు. నెల్లిమర్లలో కూడా ఆ విధంగా కౌన్సిల్ తీర్మానం చేసి రమణమ్మ కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. దీనికి చైర్‌పర్సన్ స్పందిస్తూ రమణమ్మ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వడానికి కౌన్సిల్ సానుకూలంగా ఉందని.. స్థానిక శాసనసభ్యుడితో మాట్లాడి న్యాయం చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో బాబురావు, దుర్గారావు, హరిబాబు, శ్రీను, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి


నిత్యావసర సరుకులు అందజేస్తున్న జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ సన్యాసిరావు

కొత్తవలస: ప్రతి ఒక్కరూ సామాజిక సేవాగుణం అలవర్చుకోవాలని జీవీఎంసీ అడిషనల్ కమిషనర్ వి.సన్యాసిరావు అన్నారు. మండలంలోని తుమ్మికాపల్లి గ్రామంలో ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు వార్షికోత్సవం బుధవారం నిర్వహించారు. అతిథిగా హాజరైన ఆయన ట్రస్టు తరఫున 40 మంది ఒంటరి మహిళలకు 12 రకాల నిత్యావసర సరుకులను అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 ఏళ్లగా ఫర్ ది పీపుల్ చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు భేష్ అన్నారు. ప్రధానంగా ఒంటరి మహిళలకు ప్రతీ నెల నిత్యావసర సరుకులు అందిస్తుండడం అభినందనీయమన్నారు. ట్రస్టుకు తన వంతు సాయం అందిస్తానని తెలిపారు. ట్రస్టు చైర్మన్, విశ్వనాథ హరికుమార్, వైస్ చైర్మన్ సంతోష్‌కుమార్,భారత్ డిఫెన్స్ అకాడమీ డైరెక్టర్ కదారి రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనను వివరించండి..

● డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


కార్యక్రమంలో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి


సమావేశానికి హాజరైన గ్రామ కన్వీనర్లు, గృహ సారథులు

విజయనగరం రూరల్: నాలుగేళ్లుగా సంక్షేమ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు లభించే విధంగా గ్రామ కన్వీనర్లు, గృహసారథు, పార్టీ శ్రేణులు విస్తృత ప్రచారం చేపట్టాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి తెలిపారు. ఈ నెల 11 నుంచి వచ్చే నెల 11 వరకు 'ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి?', మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాలపై మండలంలోని గుంకలాం గ్రామంలో మండల పరిధిలోని వైఎస్సార్‌సీపీ గ్రామ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ శ్రేణులతో మంగళవారం విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేస్తున్న సంక్షేమ పాలనను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరిస్తూ, వారి అభిప్రాయాలను తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనా తీరుపై ప్రజలకు సంపూర్ణమైన విశ్వాసం కలిగేలా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మీ అందరిపై ఉందని తెలిపారు. రానున్న ఎన్నికల్లో మరోసారి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాల్సిన బృహత్తర బాధ్యత అందరిపై ఉందన్నారు.

చంద్రబాబు పాలన అవినీతిమయం

నీతిమంతుడునని చెప్పుకునే చంద్రబాబునాయుడు పాలనా కాలమంతా అవినీతిమయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి ధ్వజమెత్తారు. ఎన్‌టీ రామారావు తెలుగుదేశం పార్టీని స్థాపించిన సమయంలో కాంగ్రెస్ పార్టీలో ఉన్న చంద్రబాబునాయుడు దేహీ అంటూ టీడీపీలో చేరి.. ఆ పార్టీని అడ్డగోలుగా హస్తగతం చేసుకున్న విషయాన్ని రాష్ట్ర ప్రజలు మర్చిపోరాదన్నారు. బాబు అవినీతి అనకొండని, అందుకే అరెస్ట్ అయ్యారని, ఆయనపై కక్ష పెంచుకుని జైలుకు పంపించాల్సిన అవసరం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి లేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మామిడి అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కెల్ల శ్రీనివాసరావు, జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, వైస్ ఎంపీపీ కర్రోతు నారాయణ, వైఎస్సార్‌సీపీ విజయనగరం మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

సంకల్పశక్తి కీలకం


అతిథులను సత్కరిస్తున్న కళాశాల డైరెక్టర్ డాక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: ఆనందమయమైన, ఆరోగ్యకరమైన జీవితానికి సంకల్ప శక్తి కీలకంగా నిలుస్తుందని, అది ధ్యానం వల్లే సాధ్యమని బ్రహ్మకుమారీస్ సిస్టర్స్ అన్నారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ధ్యానం ద్వారానే నీలో దాగి ఉన్న నిజమైన సామర్థ్యాన్ని తెలుసుకో' అనే అంశంపై జరిగిన సదస్సుకు పలువురు బ్రహ్మకుమారీస్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జీవితం అనేది వాళ్ల మనస్తత్వం మీద ఆధారపడి ఉంటుందన్నారు. ప్రతికూల, సానుకూల పరిస్థితులను అర్థం చేసుకోవడానికి మనలో దాగి ఉన్న సామర్థ్యాలను ఉపయోగించాలని సూచించారు. అనంతరం ముఖ్య అతిథులను నిర్వాహకులు సత్కరించారు. కళాశాల డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్రహ్మకుమారీస్ మాధురి, వైష్ణవి, మంజూష, కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రామమూర్తి, ప్రథమ సంవత్సర విభాగాధిపతి డాక్టర్ కె. శ్రీలత, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యాలు నిర్దేశించుకోవాలి

● డీఎస్పీ గోవిందరావు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గోవిందరావు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని వాటి సాధనకు కృషి చేయాలని విజయనగరం రూరల్ డీఎస్పీ ఆర్. గోవిందరావు సూచించారు. మండలంలోని మొయిద ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పలు అంశాలపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న వారిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ప్రస్తుత యువత డ్రగ్స్ బారిన పడి బంగారు జీవితాలను నాశనం చేసుకుంటున్నారని, వాటి వల్ల కలిగే అనర్థాలను తెలుసుకోవాలని సూచించారు. మహిళల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టంతో పాటు ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చిందని, బాలికలు దిశ యాప్‌పై అవగాహన పెంచుకోవాలని కోరారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్సై నారాయణరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

అవసరం మేరకే ఎరువులు

● ఏఓ పూడి నిర్మల


తెగుళ్ల నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ నిర్మల

దెంకాడ: పంట సాగులో అవసరం మేరకు మాత్రమే ఎరువులను వినియోగించాలని ఏఓ పూడి నిర్మల అన్నారు. మండలంలోని సింగవరంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ, వరి పంట దుబ్బు దశ నుంచి పాలు పోసుకునే దశ వరకు 20 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ వేయాలని సూచించారు. వరి పంటలో ఆకుముడత, తాటాకు తెగులు గుర్తించామన్నారు. ఆకుముడత, కొమ్ము పురుగులు, హిస్పా, కాండం తొలిచే పురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 2 గ్రాములు, లేదా ఎసిపేట్ 1.5 గ్రాములు లేదా ప్రొఫినోఫాస్ 2 ఎంఎల్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. అలాగే పాముపొడ తెగులు, కాండం కుళ్లు తెగులు నివారణకు హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లేదా ప్రొపికొనజోల్ మిల్లీలీటర్‌ను లీటర్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓ రామకోటి, రైతులు పాల్గొన్నారు.

తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలి

● పోస్టల్ శాఖ ఏఎస్పీ సుందరనాయుడు


మాట్లాడుతున్న ఏఎస్పీ సుందరనాయుడు, తదితరులు

పూసపాటిరేగ: తపాలా సేవలు సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ పోస్టల్ సూపరింటిండెంట్ పి. సుందరనాయుడు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పోస్టల్ శాఖ ఆధ్వర్యంలో 'జనంలోకి మనం' అనే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోస్టల్ శాఖ ద్వారా ప్రజలకు అనేక సేవలు అందిస్తున్నాన్నారు. తక్కువ ఖర్చుతో ఇన్‌స్రూ పాలసీలు ప్రవేశపెట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ పోస్టుమాస్టార్ రాంబాబు, సర్పంచ్ టి. సీతారాం, అధ్యాపకులు మురళి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీకాంత్, హలీమాతో పాటు పలువురు పోస్టల్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.